భారీ మెజార్టీతో బీఆర్‌ఎస్ గెలుపు ఖాయం

పార్టీ అభ్యర్థి, మంత్రి చామకూర మల్లారెడ్డి



మహిళ గర్జన్‌లో మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి

బోడుప్పల్: మేడ్చల్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ భారీ మెజార్టీతో గెలుస్తోందని ఆ పార్టీ అభ్యర్థి, మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. బోడుప్పల్ అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఆదివారం నిర్వహించిన మహిళా గర్జనకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన తొమ్మిదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్నిరంగాల్లో ప్రగతి సాధించిందన్నారు. సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేశారని, ఆయన హ్యాట్రిక్ సాధించడం ఖాయమన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గాలికి కొట్టుకుపోతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అవినీతి, అక్రమాలు తప్ప అభివృద్ధి జరగదన్నారు. బోడుప్పల్‌లో వక్ఫ్ బోర్డు సమస్యను వంద శాతం బీఆర్‌ఎస్ ప్రభుత్వం పరిష్కరిస్తుందన్నారు. బోడుప్పల్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేశామని, మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మిగిలిన పనులను పూర్తి చేస్తామన్నారు. బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి, బీఆర్‌ఎస్ అధ్యక్షులు మంద సంజీవ్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మి రవిగౌడ్, బీఆర్‌ఎస్ మహిళ విభాగం నాయకురాలు చామకూర ప్రీతిరెడ్డి, కార్పొరేటర్లు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు సమస్యకు శాశ్వత పరిష్కారం

మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న వజ్రేష్‌యాదవ్

బోడుప్పల్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే బోడుప్పల్‌లోని వక్ఫ్ బోర్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్, రాపోలు రాములుతో కలిసి ఆయన రాజశేఖర్ కాలనీ, దేవేందర్‌నగర్‌లో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. అలాగే ఆర్‌ఎన్‌ఎస్ కాలనీ, మారుతీనగర్ కాలనీవాసులతో వక్ఫ్ బోర్డు సమస్యపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 ఏళ్ల నుంచి ఎలాంటి సమస్య లేకుండా నివాసం ఉంటున్న కాలనీవాసులకు వక్ఫ్ బోర్డు సమస్యను బీఆర్‌ఎస్ క్రియేట్ చేసి కాలనీ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. మంత్రి మల్లారెడ్డి ప్రజా సమస్యలను గాలికి వదిలేయడంతో ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందని, ఈ ఎన్నికల్లో ఆయన ఓటమి ఖాయమన్నారు. అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలంటే కాంగ్రెస్ పార్టీకి ఓటేసి గెలిపించాలని ఓటర్లను ఆయన అభ్యర్థించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహారెడ్డి, కార్పొరేటర్లు రాసాల వెంకటేశ్‌యాదవ్, బొమ్మక్ కళ్యాణ్‌కుమార్, తోటకూర అజయ్‌యాదవ్, పులకండ్ల జంగారెడ్డి, దానగల్ల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

సబ్బండ వర్గాల అభివృద్ధే ధ్యేయం



ఉప్పల్‌లో స్వతంత్ర అభ్యర్థి అమిరిశెట్టి దేవేందర్ ప్రచారం

ఉప్పల్: సబ్బండ వర్గాల అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తానని ఉప్పల్ స్వతంత్ర అభ్యర్థి అమిరిశెట్టి దేవేందర్ అన్నారు. ఆదివారం ఉప్పల్‌లో ఇంటింటి ప్రచారం చేపట్టారు. డోలె గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ కరోనా సమయంలో పేదలకు సేవ చేశానని, ఉచితంగా పేదలకు న్యాయం విషయంలో సహకరించానన్నారు. తనలాంటి నిస్వార్థ సేవకులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

ఓటుపై విద్యార్థులకు అవగాహన



ఓటుపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

బోడుప్పల్: బోడుప్పల్ లోటస్ ల్యాప్ స్కూల్ విద్యార్థులు ఓటు హక్కుపై వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో 10వ తరగతి విద్యార్థులు పాల్గొని ఓటు హక్కు మన హక్కు అంటూ నినాదాలు చేస్తూ చురుగ్గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఓటు సామాన్య మానవుడి ఆయుధమని, తమకు సేవ చేసే నాయకుడిని ప్రజాప్రతినిధిగా ఎన్నుకోవాలని సూచించారు. 18 ఏళ్ల వయస్సు నిండిన యువతి, యువకులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మరోసారి అవకాశం ఇవ్వండి



అల్వాల్: అల్వాల్ అయ్యప్ప నగర్ వజ్ర ఎన్‌క్లేవ్ భవానీనగర్‌లో కాలనీవాసులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్కాజిగిరి కాంగ్రెస్ అభ్యర్థి మైనంపల్లి హన్మంతరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి చేశానని, మరింత అభివృద్ధి చేసేందుకు మరోసారి అవకాశం కల్పించాలని ఆయన కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే అభివృద్ధి పనులను జోరుగా కొనసాగిస్తామన్నారు.

ఆహారంలో రుచితో పాటు నాణ్యత పాటించాలి



అల్వాల్: మెరుగైన సేవలు అందజేయడంతో పాటు నాణ్యతతో కూడిన రుచికరమైన ఆహారాన్ని అందించి వారి మన్ననలు పొందాలని అల్వాల్ సర్కిల్ ఉప కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం పాత అల్వాల్‌లో యతి బీ4 వరల్డ్ క్లాస్ హాస్పిటాలిటీ ప్రైవేటు లిమిటెడ్ వారిచే నూతనంగా ఏర్పాటు చేసిన యతి మిలటరీ హోటల్‌ను ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన ప్రారంభించారు. హోటల్స్ నిర్వాహకులు లక్ష్మీకాంత్, ఇన్‌క్రెడిబుల్ ఇండియా ప్రాజెక్ట్ లిమిటెడ్ సీఈఓ ప్రవీణ్ నెడుంగడీ, ఆహార్ హోటల్ యజమాని రాకేష్ తదితరులు పాల్గొన్నారు.





అభివృద్ధిలో మల్కాజిగిరిని నంబర్-1 చేస్తాం

బీఆర్‌ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: అభివృద్ధిలో మల్కాజిగిరి నియోజకవర్గాన్ని నంబర్-1 చేస్తానని ఇటీవల మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చారని, ఆయన హామీ మేరకు గెలిచిన వెంటనే పెద్దఎత్తున అభివృద్ధి పనులు కొనసాగిస్తామని మల్కాజిగిరి బీఆర్‌ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మల్కాజిగిరిలోని వివిధ ప్రాంతాల్లో ఆదివారం ఆయన జోరుగా ప్రచారం నిర్వహించారు. వివిధ ప్రాంతాలు, కాలనీల్లో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున ప్రచారం నిర్వహించారు. మర్రి రాజశేఖర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. పేదల సంక్షేమం, అభివృద్ధి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమని అన్నారు. అన్ని వర్గాల అభివృద్ధి కోసం మర్రి రాజశేఖర్‌రెడ్డి కృషి చేస్తారని, ఎక్కడకు వెళ్లినా ఆయనకు భారీగా మద్దతు లభిస్తోందని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. మల్కాజిగిరి బీఆర్‌ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డితో పాటు ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ నందికంటి శ్రీధర్, కార్పొరేటర్లు ప్రచారం నిర్వహించారు.





ఉప్పల్‌లో గులాబీ జెండా ఎగరేస్తాం

ఉప్పల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్: ఉప్పల్ కూరగాయల మార్కెట్‌లో ఆదివారం ఉప్పల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి స్థానిక నేతలతో కలిసి ప్రచారం నిర్వహించారు. చేపల షాపులోకి వెళ్లి చేపలు కొట్టి ప్రచారం నిర్వహించారు. అలాగే కూరగాయల మార్కెట్‌లోకి వెళ్లి కార్మికులను ఓటు అభ్యర్థించారు. కార్మికుల బతుకులకు ఓ అర్థం వచ్చేలా చేస్తానని హామీ ఇచ్చారు. ఉప్పల్‌లో బీఆర్‌ఎస్ పార్టీకి బ్రహ్మరథం పడుతున్నారని, ఉప్పల్‌లో గులాబీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఉప్పల్‌లో కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. వేముల సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే ఉప్పల్ అభివృద్ధి

మల్లాపూర్: బీఆర్‌ఎస్‌తోనే ఉప్పల్ నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని బీఆర్‌ఎస్ ఉప్పల్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి అన్నారు. నాచారంలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. నాచారం గీత పారిశ్రామిక సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశానికి హాజరై మాట్లాడారు. గౌడ సంఘం ప్రతినిధులు మద్దతు ప్రకటిస్తూ ఏకగ్రీవం తీర్మానం చేశారు.

కారు గుర్తుకు ఓటు వేయాలి

కారు గుర్తుకు ఓటు వేసి ఆదరిస్తే అభివృద్ధి చేస్తాడని జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ అన్నారు.

గ్యారంటీ పథకాలకు వారంటీ లేదు

కాంగ్రెస్ ప్రవేశపెట్టిన గ్యారంటీ పథకాలకు వారంటీ లేదని, వారు అధికారంలోకి వస్తే ఢిల్లీలో రిమోట్ ఉంటుందని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. మల్లాపూర్ నెహ్రూనగర్‌లో బండారి లక్ష్మారెడ్డిని గెలిపించాలని ప్రచారం చేశారు.



ఉప్పల్ కూరగాయల మార్కెట్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి



బండారి లక్ష్మారెడ్డికి ఫొటోను అందజేస్తున్న నాచారం గౌడ్ సంఘం ప్రతినిధులు



నాచారంలో కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్

భారీ మెజార్టీతో కాంగ్రెస్‌ను గెలిపించాలి

ఉప్పల్ కాంగ్రెస్ అభ్యర్థి మందుముల పరమేశ్వర్‌రెడ్డి

ఉప్పల్: సకలజనుల ముసాయిదాను అమలు చేస్తానన్న కాంగ్రెస్‌కు పట్టం కట్టాలని సీపీఐ ఉప్పల్ నియోజవర్గ కార్యదర్శి జీ.దామోదర్ పిలుపునిచ్చారు. అబద్దాలను ప్రచారం చేయడంలో కేసీఆర్ సిద్ధహస్తుడని ఆయన విమర్శించారు. నియోజవర్గంలో రామంతాపూర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి మందుముల పరమేశ్వరెడ్డికి మద్దతుగా ఆదివారం గోకలేనగర్ వెంకటరెడ్డినగర్, శారదానగర్, శ్రీనివాస్‌పురం తదితర ప్రాంతాల్లో సీపీఐ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. చేతి గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.శంకర్‌రావు, మండల కార్యదర్శి రామ్ నారాయణ, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర, జిల్లా కార్యదర్శి టి.సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ భగాయత్ లే అవుట్‌లో ప్రచారం..

ఉప్పల్ భగాయత్ లే అవుట్‌లో కాంగ్రెస్ అభ్యర్థి పరమేశ్వరెడ్డికి మద్దతుగా మార్నింగ్ వాకర్స్, వివిధ పార్టీల నేతలు ఆయనకు మద్దతు తెలుపుతూ ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా ఉంటామని హామీ ఇచ్చారు.

హబ్సిగూడ డివిజన్‌లో..

హబ్సిగూడ డివిజన్ థామస్స్ చర్చిలో క్రిస్టియన్ సోదరుల ఆహ్వానం మేరకు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఎన్నికల్లో ప్రజలనే నమ్ముకున్నా..

మల్లాపూర్: మల్లాపూర్ మల్లికార్జున్‌నగర్ కాలనీ మాజీ అధ్యక్షులు ధనుంజయ్య కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి మందముల పరమేశ్వర్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. నాచారం ఎర్రకుంట కాలనీకి చెందిన సామాజిక వేత్త గద్ద క్రాంతి కాంగ్రెస్ పార్టీలో చేరారు.



ఉప్పల్ భగాయత్‌లో ప్రచారం చేస్తున్న పరమేశ్వర్‌రెడ్డి



హబ్సిగూడ డివిజన్ థామస్స్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న పరమేశ్వర్‌రెడ్డి



రామంతాపూర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి మందుముల పరమేశ్వరెడ్డికి మద్దతుగా సీపీఐ నేతల ప్రచారం

ఉప్పల్‌లో గెలిచేది బీసీ నినాదమే..

బీజేపీ అభ్యర్థి ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్



ఉప్పల్ కేకే గార్డెన్స్‌లో మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్

ఉప్పల్: సకలజనులు సాధించుకున్న రాష్ట్రంలో వారికే ప్రాతినిధ్యం లేకుండా చేసింది కేసీఆర్ అని, అందుకే బీజేపీ అధికారంలోకి వస్తే ముఖ్యమంత్రి పీఠం బీసీలకే అని ఉప్పల్ బీజేపీ అభ్యర్థి ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్ అన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ లేకుంటే కేటీఆర్ సీఎం అని వీరికోసమే ప్రభుత్వం నడుస్తుందని ఎద్దేవా చేశారు. ఉప్పల్ కొమ్మిడి క్రిష్టారెడ్డి గార్డెన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన బీసీల ఆత్మీయ సమ్మేళనానికి ప్రభాకర్ హాజరయ్యారు. అంతకుముందుగా ఉప్పల్ రింగ్ రోడ్డు నుంచి వీటీ కమాన్ మీదుగా ప్రజలకు అభివాదం చేస్తూ గార్డెన్‌కు చేరుకున్నారు.

- బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల్లో ముఖ్యమంత్రి ఎవరనేది ఇంకా స్పష్టత లేదని, బీజేపీలో మాత్రం బీసీ ముఖ్యమంత్రి అని మోదీ ప్రకటించి చరిత్ర నెలకొల్పాడన్నారు. రాష్ట్రంలో ప్రత్యేక పరిస్థితుల్లో ఎన్నికలు జరుగుతున్నాయని, ఎంబీసీలకు రూ.వెయ్యి కోట్లు ఇస్తానని మాట ఇచ్చిన కేసీఆర్ కనీసం రూ.100 కోట్లు కూడా ఇవ్వకుండా సబ్బండ జాతులను మోసం చేశాడని ఆరోపించారు. అన్ని వర్గాల వారు 'చాలు.. సారు.. కారు' అంటూ నినదిస్తున్నారని గుర్తుచేశారు. ఉప్పల్‌లో వ్యాపారులు, దళారులు కావాలో లేక ప్రజల కోసం పనిచేసే వారు కావాలో నిర్ణయించుకోవాలన్నారు. తూళ్ల వీరేందర్‌గౌడ్, గొరిగే కృష్ణ, మహంకాళి నర్సింహ, గోనే అంజయ్య, శ్రీకాంత్, రావుల బాలకృష్ణ, బోరంపేట మురళి, రెవల్లిరాజు, రెడ్డిగారి దేవేందర్ రెడ్డి ఏచూరి యాదగిరి, బాలచందర్, దాస్‌గౌడ్, వెంపటి శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.

న్యాయ దర్బార్ ఏర్పాటు చేస్తా

బీజేపీ మల్కాజిగిరి అభ్యర్థి రామచంద్రరావు



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ మల్కాజిగిరి అభ్యర్థి రామచంద్రరావు

మల్కాజిగిరి: మల్కాజిగిరి నియోజకవర్గం పరిధిలోని పేద మధ్యతరగతి ప్రజల కోసం న్యాయ దర్బార్ ఏర్పాటు చేస్తామని బీజేపీ అభ్యర్థి రామచంద్రరావు అన్నారు. ఈస్ట్ ఆనంద్‌బాగ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మల్కాజిగిరిలో అవకాశం ఇచ్చినప్పటికీ టీడీపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదన్నారు. ఆర్‌యూబీలు, చెరువుల పరిరక్షణ, ముంపు సమస్య కూడా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న విధంగా ఉందన్నారు. ప్రస్తుతం బీఆర్‌ఎస్ అభ్యర్థి, కాంగ్రెస్ అభ్యర్థి కేవలం కుటుంబ రాజకీయాల కోసమే తాపత్రయపడున్నారే తప్ప ప్రజాసమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధి లేదన్నారు. బీజేపీకి అవకాశం ఇచ్చి తనను గెలిపిస్తే మల్కాజిగిరి శాంతియుతంగా ఉండటమే కాకుండా సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తానని అన్నారు. కార్పొరేటర్లు శ్రవణ్, రాజ్యలక్ష్మి, సునీత యాదవ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే మైనంపల్లి ఎలాంటి అభివృద్ధి చేపట్టలేదన్నారు. మూడు డివిజన్లలో గణనీయమైన అభివృద్ధి సాధించామని, బీజేపీకి అవకాశం ఇవ్వాలని కోరారు. సమావేశంలో నాయకులు వీకే మహేష్, బాలలింగం, శ్రీనివాస్, రవియాదవ్, భానుప్రకాష్, టీం సాయి, రమణారెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.